నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి 1

శుక్రవారం 17 ఫిబ్రవరి 2023

యువకుల రక్తదానం

నవతెలంగాణ-మద్నూర్

నర్సుగొండ వర్ధంతిని పురస్కరించుకుని డోంగ్లి మండలంలోని పెద్దటాక్లిలో యూత్ రక్తదాన శిబిరం నిర్వహించగా.. 25 మంది యువకులు రక్తదానం చేశారు. రక్తదాన కార్యక్రమానికి సెవెన్ హిల్స్ బాన్సువాడ ఆసుపత్రి వైద్యులు పాల్గొని రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ రాజాబాయి విలాస్ అందించిన కృషికి యూత్ యువకులంతా అభినందించారు. అంతకుముందు నర్సుగొండ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.



రక్తదానం చేస్తున్న యువకులు

గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

నవతెలంగాణ-దోమకొండ

ప్రభుత్వం నిషేధించిన గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలు ఎవరైనా వాడితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని సీఐ పోత రెడ్డి అన్నారు. గంజాయి, డ్రగ్స్ తదితర ఉత్ప్రేరకాల వాడకంతో కలిగే దుష్పరిణామాలపై దోమకొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఇంటర్ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ సుధాకర్, ప్రిన్సిపాల్ జైపాల్ రెడ్డి, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రణాళికతో ధాన్యం కొనుగోలు

- కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసుకోవాలి
- వరి దిగుబడి ముందే అంచనా వేసి గన్నీ బ్యాగ్‌లు సిద్ధం చేయాలి
- సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

యాసంగి-2023 ధాన్యం కొనుగోలు కోసం జిల్లా అధికారులు ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో గురువారం యాసంగి ధాన్యం కొనుగోలు పై వ్యవసాయ, మార్కెటింగ్, ఐకెపి, సివిల్ సప్లై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారులు వచ్చే దిగుబడిని అంచనా వేయాలని తెలిపారు. సరిపడ గన్ని సంచులను సిద్ధం చేయాలని చెప్పారు. కొనుగోలుకు సంబంధించి యంత్రాలు, ఇతర సామాగ్రిని సమకూర్చాలని అధికారులకు సూచించారు. మార్కెటింగ్, వ్యవసాయ, సహకార శాఖల అధికారులు, ఐకెపి అధికారులు సమన్వయంతో పనిచేసి ధాన్యం కొనుగోలు సజావుగా సాగే విధంగా చూడాలని పేర్కొన్నారు. రైతులకు సరిపడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో రెవెన్యూ కలెక్టర్ చంద్రమోహన్, డిఎస్ఓ పద్మ, జిల్లా వ్యవసాయ అధికారిని భాగ్యలక్ష్మి, జిల్లా మార్కెటింగ్ అధికారిని రమ్య, ఐకెపి, సహకార, వ్యవసాయ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్..



విద్యార్థినితో చెస్ ఆడుతున్న కలెక్టర్

చెస్ క్రీడాకారులు చాంపియన్‌లు కావాలి

చెస్ క్రీడాకారులు చాంపియన్‌షిప్ సాధించడానికి పట్టుదలతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా కామారెడ్డి ఇంద్ర గాంధీ స్టేడియంలో గురువారం జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో మహిళలకు జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. క్రీడలలో ఓటమి చెందిన వారు అసంతృప్తికి లోను కావద్దని సూచించారు. నేటి ఓటమి రేపటి గెలుపునకు నాంది పలుకుతుందని చెప్పారు. క్రీడల వల్ల స్నేహభావం పెరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైన ఇద్దరు మహిళా క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి దామోదర్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, మహిళా క్రీడాకారులు పాల్గొన్నారు.



పాదయాత్ర చేపడుతున్న కార్మికులు

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-భిక్కనూర్

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన పాదయాత్రకు సంఘీభావంగా మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు శ్యామ్, కార్యదర్శి స్వామి, సిద్ది రాములు, జావీద్, సురేందర్, నవీన్, ప్రభాకర్, గణేష్, శీను తదితరులు పాల్గొన్నారు.

లంపి స్కీన్ వైరస్ కలకలం..

వైరస్‌తో ఆవు దూడ మృతి

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

కామారెడ్డి జిల్లాలో లంపి స్కిన్ వైరస్ కలకలం రేపుతోంది. కామారెడ్డి మార్కెట్‌లో ఆవుకు లంపి స్కిన్ వైరస్ సోకగా రెండు రోజుల క్రితం ఆవు మృతి చెందింది. కాగా తాజాగా గురువారం మరో లేగ దూడ మృతి చెందింది.



వివరాలు మెయిన్‌లో..

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత

నవతెలంగాణ-మద్నూర్

డోంగ్లి మండలంలోని మొగ గ్రామంలో గల పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తూ ఏడాది క్రితం గుండె పోటుతో మృతి చెందిన పవన్ కుమార్ మొదటి వర్ధంతిని పురస్కరించుకొని జ్ఞాపకార్థంగా ఆయన తండ్రి డెబ్బడ్‌వార్ ప్రకాశ్ గ్రంథాలయానికి పుస్తకాలు గురువారం అందజేశారు. నిరుద్యోగ యువకులకు అవసరమయ్యే పోటీపరీక్షల పుస్తకాలతో పాటు ఇతరాత్ర పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో మొగ పాఠశాల హెచ్ ఎం శివప్రభ, ఉపాధ్యాయ బృందం కలిసి సర్పంచ్ సురేష్, పవన్ సర్ తండ్రి ప్రకాష్ చేతుల మీదుగా గ్రంథాలయానికి అన్ని పోటీ పరీక్షలకు సంబంధించిన ఉన్న పుస్తకాలను అందజేశారు. ఆయన మిత్రులు గోశాలకు పచ్చిగడ్డి, బెల్లం, పిండి, రూ.9 వేల నగదు అందజేశారు.



పుస్తకాలు అందజేత

బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధి..

సుపరిపాలనకు నిదర్శనం

- స్పీకర్ పోచారం

నవతెలంగాణ-కోటగిరి

సీఎం కేసీఆర్ సహకారంతో బాన్సువాడ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని, సుపరి పాలనకు నిదర్శమని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని సుద్దులం తండాలో రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించి అనంతరం సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ప్రజావేదిక చేపట్టి గ్రామస్తులతో మాట్లాడారు. సంక్షేమ కార్యక్రమాలలో అర్హులైన వారికి లబ్ధి చేకూరుతుందని విడతల వారీగా సంక్షేమ ఫలాలు అందుతాయని తెలిపారు. నాయకులు, అధికారులు, నిజాయితీగా పని చేయాలని లేకుంటే చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజేశ్వర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పోచారం సురేందర్ రెడ్డి, ఎంపీపీ సునీత శ్రీనివాసరావు, జెడ్పీటీసీ శంకర్ పటేల్, సర్పంచ్ కిషన్, ఎంపీడీవో మనోహర్ రెడ్డి నాయకులు పాల్గొన్నారు.



జీపీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న స్పీకర్

బ్యాంక్ లింకేజీ టార్గెట్ చేరాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ మురళి

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండల కేంద్రంలోని మండల సమైక్య కార్యాలయంలో ఏపీడి మురళి జుక్కల్, మద్నూర్, బిచ్కుంద, పెద్ద కొడప్‌గల్, పిట్లం, నిజాంసాగర్ మండలాలకు చెందిన ఏపీఎంలు, సీసీలతో రివ్యూ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు వారి వారి సబ్జెక్టు వారిగా రివ్యూ నిర్వహించి బ్యాంకు లింకేజ్.. మార్చి చివరి వరకు మండలాలకు కేటాయించిన టార్గెట్ పూర్తి చేయాలని ఎన్ పీఏ లేకుండా చూడాలని, సంఘం సభ్యులకు అందరికీ లోన్ సౌకర్యం కల్పించాలని, సంఘాల సమావేశం ఖచ్చితంగా నిర్వహించాలని సమావేశంలోనే (అప్పులు చెల్లింపులు) ఆర్థిక లావాదేవీలు నిర్వహించాలని సూచించారు. సంఘం పూర్తి వివరాలు ఎప్పటికప్పుడు ఫోన్‌లో నిక్షిప్తం చేయాలని, సంఘం సభ్యులకు సోలార్ విద్యుత్ వినియోగం, చెపల పెంపకం, ఆదాయాల అభివృద్ధికి ప్రణాలికలు తయారు చెయాలని సూచించారు. ఈ సమావేశంలో డీపీఎమ్ లు సుధాకర్, రవిందర్ , ఆరు మండలాల ఏపీఎంలు నాగరాజు, సత్యనారాయణ, మనోహర్, శీరీష, రామనారాయణ్ గౌడ్, రవీందర్, సీసీలు పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరం ప్రారంభం

నవతెలంగాణ-మద్నూర్/ఎల్లారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని డోంగ్లి మండలంలోని మొగలో గురువారం సర్పంచ్ సూర్యకాంత్ పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామ ప్రజలంతా సద్వినియోగం పరుచుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు నిర్వహించుకొని ప్రభుత్వం అందించే సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కంటి వెలుగు కార్యక్రమంలో సర్పంచ్ పలువురికి సన్మానించారు. కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభోత్సవంలో పంచాయతీ పాలకవర్గం సభ్యులు పంచాయతీ సిబ్బంది గ్రామస్తులు కంటి వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మండలంలోని అడివి లింగాల గ్రామంలో గురువారం సర్పంచ్ సువర్ణ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిటిసి బత్తుల పార్వతి, వైద్య సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

హాత్‌సే హాత్ జోడోయాత్రలో కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

వరంగల్ జిల్లా ఆలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన హాత్‌సే హాత్ జోడో యాత్రలో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డితో కలిసి ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వడ్డేపల్లి సుభాష్ రెడ్డి, జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూస్తుంటే అధికార పార్టీపై ఎంత వ్యతిరేకత ఉందో అర్థం అవుతుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో అధికార పార్టీకి ప్రజల నుంచి గుణపాఠం తప్పదని స్పష్టంచేశారు.



రేవంత్‌రెడ్డితో నాయకులు

వైకుంఠధామం పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణంలో నూతనగా నిర్మిస్తున్న వైకుంఠధామం పనులను గురువారం ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, మున్సిపల్ అడ్మిషన్ స్టేట్ అధికారి తిరుపతికుమార్ వైకుంఠధామంలో జరుగుతున్న పనులు పరిశీలించారు. సిరిసిల్లలో నిర్మించిన మాడల్‌గా ఎల్లారెడ్డిలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. నాణ్యతతో పనులు చేపట్టి సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. వీరి వెంట కామారెడ్డి మున్సిపల్ పబ్లిక్ హెల్త్ అధికారి డిఈ సంతోష్ కుమార్, ఎల్లారెడ్డి మున్సిపల్ ఏఈ వినోద్ కుమార్, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి రామప్ప, నాయకులు శ్రవణ్ కుమార్ రాజు పాల్గొన్నారు.

గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి మృతి

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్ద మల్లా రెడ్డి ప్రధాన రహదారిపై గత మూడు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి చెందాడని ఎస్సై ఆనంద్ గౌడ్ గురువారం తెలిపారు. మృతునికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహానికి స్థానిక మున్సిపల్ సిబ్బందితో కలసి పోలీసులు అంత్యక్రియలు నిర్వహించినట్టు తెలిపారు. ఎవరైనా సంబంధిత వ్యక్తులు ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై తెలిపారు.



అక్రమ మద్యం, నాటుసారా విక్రయాలు అరికట్టాం

బిచ్కుంద ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ

నవతెలంగాణ-బిచ్కుంద

మద్నూర్, జుక్కల్, బిచ్కుంద, పెద్ద కోడప్ గల్ మండలాల పరిధిలోని గ్రామాలలో అక్రమ మద్యం, నాటుసారా విక్రయం, రవాణా చేయకుండా అరికట్టినట్టు బిచ్కుంద ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తెలిపారు. మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో సిఐ సత్యనారాయణ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో ఈ సంవత్సరం 107 కేసులు నమోదు చేయడం జరిగిందని, ఇందులో దేశిదారు అనుమతులు లేకుండా కల్తీ కల్లు విక్రయాలు, గాంజా విక్రయాల పై కేసులు, దేశి దారు తరలిస్తున్న నాలుగు ద్విచక్ర వాహనాలు, గాంజా తరలిస్తున్న ఆటోను సీజ్ చేసినట్టు తెలిపారు. రాష్ట్ర సరిహద్దుల్లో పక్కా నిఘా ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నామని దేశిదారు, గాంజా, ఇల్లీగల్ లిక్కర్ సరఫరా కాకుండా అడ్డుకోగలిగినటుట తెలిపారు. అక్రమ రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఐ వెంట ఎస్సై అభిషేక్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ప్రతిగ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ గణేశ్ సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లతో ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఎస్ఐ గణేష్ మాట్లాడుతూ సిసి కెమెరాలు ప్రతి గ్రామంలో ఏర్పాటు చేయాలని సిసి కెమెరాల వల్ల నేరాల నియంత్రణ చేయవచ్చుని తెలిపారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు నిందితులను పట్టుకోవడంలో సిసి కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని సర్పంచ్‌లకు సూచించారు. దీనికి సర్పంచ్‌లు సానుకూలంగా స్పందించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎల్లారెడ్డి మండల సర్పంచ్ లు పాల్గొన్నారు.



అనాథలకు అండ



నిత్యాన్నదాన సత్రం

సేవా కార్యక్రమాల్లో మద్దికుంట ఆలయం

- ప్రకృతి రమణీయతలో వెలిసిన స్వయంభు బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలంయలో శివరాత్రికి ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-రామారెడ్డి

ఆకుపచ్చని దట్టమైన అడవిలో, ప్రకృతి అందాల మధ్య కొలువైన మద్దికుంట శ్రీ స్వయంభు బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం భక్తులను, సందర్శకులను ఆకట్టుకుంటుంది. యాచకులు లేని గుడిగా మద్దికుంట ఆలయం ప్రసిద్ధికెక్కింది. అనాథలను, వృద్ధులను అక్కున చేర్చుకుంటుంది. నిత్య అన్నదానం, అనాథాశ్రమం నెలకొల్పి ఆలయ కమిటీ సామాజిక సేవలో ఆదర్శంగా నిలుస్తుంది. శివరాత్రి పండగ నేపథ్యంలో ప్రత్యేక వేడుకలకు ముస్తాబైంది.

కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలోని మద్దికుంట గ్రామానికి రెండున్నర కిలోమీటర్ల దూరంలో శ్రీ స్వయం బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం ఉంది. 30 సంవత్సరాల క్రితం చిన్న గుడితో వెలిసిన ఆలయానికి వెళ్లడానికి గతంలో భక్తులు సందర్శకులు కాలినడకన వెళ్లేవారు. అతి పురాతనమైన ఈ ఆలయాన్ని గ్రామస్తులంతా సంఘటితమై, కలిసికట్టుగా, కులాలకు అతీతంగా ఆలయ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. తమ గ్రామ దేవాలయాన్ని మొదటగా తమ గ్రామంతో పాటు పరిసర గ్రామాల కోసం 2001వ సంవత్సరంలో పనులు ప్రారంభించారు. ఇంతింతై వటుడింతై అన్న చందంగా ఆలయం దాతల సహకారంతో అభివృద్ధి శరవేగంగా జరుగుతుండటంతో, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల సందర్శకులు ఈ ప్రాంతాన్ని సందర్శిస్తున్నారు. మాజీ మంత్రి షబ్బీర్ అలీ, మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు సహకారంతో ఆనాడు బీటీ రోడ్డు, విద్యుత్ లైన్లను ఏర్పాటు చేసి, నిత్య అన్నదానానికి సత్రం భవనాన్ని ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో 2003లో ప్రారంభమైన నిత్య అన్నదాన కార్యక్రమం ఏడాది పాటు దాదాపు రోజు 400 మంది ఆకలి తీరుస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ దాతల సహకారంతో అనాథ, వృద్ధాశ్రమాన్ని నెలకొల్పారు. దాదాపు 30 మంది ఆశ్రమం పొందుతున్నారు. వీరికి ఉచిత భోజనం, దుస్తులు, ఆరోగ్య సమస్యలు ఆలయ కమిటీ దగ్గర ఉండి చూసుకుంటుంది. పేద కుటుంబాలకు అండగా నిలుస్తుంది.





నిత్యం పారే జలపాతం.. ఆహ్లాద పరిచే అటవీ అందాలు

నీటి అవసరాలు తీరుస్తున్న జలపాతం..

చుట్టూ ఉండే కొండలు, వృక్షాల మధ్య నుండి వచ్చే జలపాతం ఏడాది పొడవునా అక్కడికి వచ్చే భక్తులకు, సందర్శకులకు నీటి అవసరాలను తీరుస్తుంది. ఏడాదిపాడు జలపాతం పారుతూ సందర్శకులను ఆకట్టుకుంటుంది. హాల్లాదకరమైన వాతావరణంలో రాత్రిపూట బస చేసే సందర్శకుల కోసం దాతల సహకారంతో సకల సౌకర్యాలతో, నామమాత్ర రుసుముతో కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేశారు.

శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

శివరాత్రి ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో 3 లక్షల మంది దర్శించుకోనున్నారని ఆలయ కమిటీ అంచనా. ఇందుకోసం కమిటీ అన్ని ఏర్పాట్లనూ పూర్తి చేసింది. శుక్రవారం నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. వివిధ రకాల పూజలు నిర్వహించి, సాయంత్రం స్వామివారిని గ్రామ ప్రధాన వీధిలో కూడా ఊరేగింపు నిర్వహిస్తారు. శనివారం ఉదయం 11:05 నిమిషాలకు అంగరంగ వైభవంగా శివపార్వతుల కళ్యాణం, సాయంత్రం నాలుగు గంటలకు రథోత్సవం, రాత్రి భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు, ఆదివారం అగ్ని గుండాలతో ఉత్సవాలు ముగియనున్నాయి. శివరాత్రి రోజు అన్నదాతగా కాప శ్రీలక్ష్మి- లక్ష్మీ నరసింహారెడ్డి ఒంగోలు, ప్రతి సంవత్సరం కూరగాయల దాత పన్యాల వనజ- వెంకటి (కామారెడ్డి), ఆలయ ధర్మకర్తగా మెరుగు తరుణి- రవీందర్ రెడ్డి (ముత్యంపేట్), మాదారపు అశ్విని- సతీష్‌రావు(కరీంనగర్), తదితరులు ఆలయానికి సహకరిస్తున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది.



భోజనం చేస్తున్న సందర్శకులు

వైభవంగా ఉత్సవాలు

ప్రభాకర్ స్వామి, ఆలయ ప్రధాన అర్చకులు

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వీఐపీలు, రాజకీయ ప్రజా ప్రతినిధులు, వివిధ రాష్ట్రాల నుండి, జిల్లాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. శివపార్వతుల కళ్యాణోత్సవంతో పాటు కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తాం. భక్తులు, సందర్శకులు ఉత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలి.



ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాం

గోజారి లచ్చిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్

భక్తుల కోసం ఆలయ ప్రాంతంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాం. ఆలయానికి వచ్చే ప్రతి ఒక్కరికి అన్నదాన ఏర్పాటుతో పాటు, బస చేయటానికి ఏర్పాట్లు, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. మూడు రోజులపాటు ఆలయంలో స్వామి వారి ఉత్సవాలు గ్రామస్తుల, భక్తుల సహకారంతో ఘనంగా నిర్వహిస్తున్నాము. ఉత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి.



మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు చేపట్టాలి

- ఎంపీడీవో శ్రీనివాస్

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలంలోని ఆయా గ్రామాలలో నిర్వహిస్తున్న నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా నిరంతరం వాటికి నీటిని అందించాలని, అవి ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని బోధన్ ఎంపీడీవో శ్రీనివాస్ పంచాయతీ సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన పెంటకలాన్ నర్సరీని ఆకస్మికంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామానికి ఇచ్చిన లక్ష్యానికి అనుగుణంగా నర్సరీలో మొక్కలు పెంచాలని, ఎండిపోయిన మొక్కలను తొలగించి వాటి స్థానంలో కొత్త మొక్కలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట సర్పంచ్ తల్వేద రమణ, పంచాయతీ కార్యదర్శి రేఖ, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ నాగార్జున, ఫీల్డ్ అసిస్టెంట్ సాయికుమార్ ఉన్నారు.

జీజీహెచ్‌లో డీఎంఈ ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో డీఎంఈ రమేష్‌రెడ్డి ఆసుపత్రిని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 1,2,3వ ఫ్లోర్‌లలో అక్కడ ఉన్న రోగులను కలిసి, డ్యూటీ డాక్టర్లతో మాట్లాడారు. తదనంతరం అక్కడ ఉన్న ఓటి రిజిస్టర్‌ను, డ్యూటీ డాక్టర్ల రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు తనిఖీలు చేసిన మొదటి అంతస్తు మూడో అంతస్తులోని మళ్లీ మళ్లీ తనిఖీలు చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, ఏడీ సంతోష్, నర్సింగ్ సూపరింటెండెంట్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులు

100 శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలి

- స్థాయి సంఘం సమావేశంలో
- జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న జెడ్పీచైర్మెన్ విఠల్‌రావు

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదివే 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణతను సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు అధ్యక్షతన గురువారం స్థాయి సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. ఈ సంవత్సరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణతను సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా సబ్జెక్టు పరంగా అవసరమైన ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అందించే సన్నబియ్యంతో రుచికరమైన భోజనాన్ని అందిస్తున్న తరుణంలో ఎటువంటి ఘటనలు జరుగకుండా చూసుకోవాలని డీఈఓను ఆదేశించారు. సీజనల్ వ్యాధులు అరికట్టడానికి పీహెచ్‌సీ లలో ఉన్న సిబ్బందికి ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని, పీహెచ్‌సీలను విధిగా తనిఖీలు చేయాలని డీఎంహెచ్‌ఓ సూచించారు. జిల్లాలో ఉన్న ప్రయివేటు ఆసుపత్రులను తనిఖీ చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. మధ్యాహ్నం జరిగిన సమావేశంలో సీడీపీఓలను ఉద్దేశించి చైర్మన్ మాట్లాడుతూ.. పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సరిగ్గా అందించేందుకు అందరూ కృషి చేయాలని, ఎక్కడా పిల్లలకు బాలింతలకు, గర్భిణులకు ఇబ్బంది కలగకుండా చూడాలని సీడీపీవోలు విధిగా వారి పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఈఓ గోవింద్, డీఇఓ దుర్గాప్రసాద్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుదర్శనం, ఆయుష్ డాక్టర్ రమణ మోహన్, బోధన్ జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకులు శివ శంకర్, జెడ్పీటీసీ సభ్యులు భారతి వేల్పూర్, దాసరి లావణ్య, నందిపేట్ ఎర్రం యమున, మోపాల్ బానోత్ కమల, సీడీపీఓలు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు వృత్తి నైపుణ్య పరీక్షలు



నైపుణ్య పరీక్షల్లో పాల్గొన్న మత్స్యకారులు

నవతెలంగాణ-భీంగల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల రిజిస్ట్రేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గురువారం మండలంలోని బాబాపూర్ గ్రామంలోని మత్స్యకారులకు జిల్లా అధికారి రాజనర్సయ్య ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకారులు చేపలు పట్టే విధానాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ నాగేష్, మేనేజర్ జీవన్, బాబాపూర్ సర్పంచ్ ఆయేషా ఫిర్దోస్, ఎంపీటీసీ సుర్జీల్, పంచాయతీ కార్యదర్శి మత్స్యకారులు పాల్గొన్నారు.

నేటి నుంచి బోర్గంలో కంటి వెలుగు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గం గ్రామంలో శుక్రవారం నుంచి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వినయ్‌కుమార్ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పరిసరాలను పరిశీలించడానికి ఆరోగ్య విస్తీర్ణ అధికారి శ్రావణ్ కుమార్‌ను పంపినట్టు వివరించారు. 18 సంవత్సరాల పైబడిన వారందరూ ఈ కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆయన వెంట ఉప సర్పంచ్ ఫిరోజ్ ఉద్దీన్, ఆరోగ్య కార్యకర్త మంజుల, గ్రామ కార్యదర్శి సుమన్ తదితరులున్నారు.

శనగ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

నవతెలంగాణ-రెంజల్

మండలంలో శనగ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందని మండల వ్యవసాయాధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మద్దతు ధర క్వింటాకు రూ.5,335 ప్రకటించారని, త్వరలోనే నీలా, రెంజల్ సింగిల్ విండోల ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. రైతులు దళారుల చేతుల్లో మోసపోవద్దనీ, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జాతీయస్థాయి సీనియర్ మహిళల హాకీ జట్టుకు నిజామాబాద్ జిల్లా క్రీడాకారి ఎంపిక

నవతెలంగాణ-కంఠేశ్వర్



గత జనవరి నెలలో రంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన ఓపెన్ సెలక్షన్‌లో జిల్లా నుంచి మంచి ప్రతిభ కనబరిచిన కశిష్ 13వ జాతీయస్థాయి సీనియర్ మహిళల హాకీ జట్టుకు ఎంపికైందని, కాకినాడలో ఈనెల 15 నుంచి 26వ తేదీ వరకు జరగబోయే హాకీ ఇండియా, జాతీయస్థాయి మహిళల హాకీ టోర్నమెంట్‌లో పాల్గొంటుందని నిజామాబాద్ జిల్లా హాకీ సంఘం అధ్యక్షులు విశాఖ గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ తెలియజేశారు. ఈ కశిష్ ఎంపిక పట్ల ఉద్దేశించి మాట్లాడుతూ.. సీనియర్ మహిళల హాకీ జట్టుకి ఎంపికవడం నిజామాబాద్ జిల్లాకు గర్వకారణమని తెలియజేశారు. అదేవిధంగా మరిన్ని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఈ సందర్భంగా ఆమెను ఆశీర్వదించారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా హాకీ సంఘం అధ్యక్షులు విశాఖ గంగారెడ్డి, జిల్లా హాకీ సంఘం ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ, కోశాధికారి పింజ సురేందర్, ఉపాధ్యక్షులు విద్య సాగర్‌రెడ్డి, నరసింహారెడ్డి, హనుమంతు, రిటైర్డ్ హాకీ కోచ్ హర్షవర్ధన్‌రెడ్డి, మక్బూల్ (హాకీకోచ్), సంయుక్త కార్యదర్శులు ఎండీ జావిద్ (హాకీ కోచ్), యండీ ఆరిఫ్, చిన్నయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి అంజు, ఈసీ మెంబర్ సంతోష్, నాగేష్, సుధీర్, కత్తి శ్రీనివాస్, నవనీత్, సీనియర్ క్రీడాకారులు వీరిని అభినందించారు.

సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలి

- డీఈవో దుర్గాప్రసాద్
- దుబ్బ ప్రభుత్వ ఉన్నత పాఠశాల తనిఖీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

విద్యార్థులు చదివే సమయంలో సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలని డీఈవో దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల దుబ్బను డీఈవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మొదట ప్రేయర్‌లో హాజరయ్యారు. అనంతరం కొద్దిసేపు పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులతో మాట్లాడారు. రానున్న పదవ తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు హార్డ్‌వర్క్ చేయాలని.. తెల్లవారుజామునే 4:30 గంటలకు నిద్రలేచి చదువుకోవాలని తెలిపారు. చదివేటప్పుడు సందేహాలు ఏవైనా వస్తే ఓ నోటుబుక్కులో రాసుకొని పాఠశాలకు రాగానే సంబంధిత సబ్జెక్టుకు సంబంధించిన అధ్యాపకుడిని కలిసి నివృతి చేసుకోవాలని తెలిపారు. ఖచ్చితంగా లక్ష్యాన్ని పెట్టుకుని చదువుకోవాలని సూచించారు. విద్యార్థి 100శాతం మార్పులు తెచ్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో దుబ్బ ప్రభుత్వ హైస్కూల్ అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

కేసీఆర్ హయాంలో అన్నివర్గాలకూ సముచిత స్థానం

- జెడ్పీటీసీ జగన్ మోహన్

నవతెలంగాణ-ధర్పల్లి

ముఖ్యమంత్రి హయాంలోనే రాష్ట్రంలోని అన్నివర్గాలకు సముచిత స్థానం కల్పిస్తున్నారని జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ మోహన్ అన్నారు. గురువారం మండలంలోని రామడుగు గ్రామంలోని ముదిరాజ్‌ల సౌకర్యం కొరకు సంఘం భవన నిర్మాణానికి 14వ ఫైనాన్స్ ద్వారా 12 లక్షలు నిధులతో భూమిపూజ చేశారు. అలాగే రూ.3లక్షలతో గ్రామంలోని బైపాస్ రోడ్డు నుంచి హనుమాన్ మందిరం వరకు సీసీ రోడ్డు పనులు, అలాగే చల్లగర్గ గ్రామంలో సీడీపీ నిధుల నుంచి రూ.10లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించినట్టు చెప్పారు. ఇంతటి మంచి పాలనపై కొందరు కావాలనే రాష్ట్ర ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని, ప్రతిపక్షాల కల్లబొల్లి మాటలను ప్రజలు పట్టించుకోవద్దని సూచించారు. అలాగే గ్రామానికి హరిత రిసార్ట్ రానుందని ప్రతిపాదనలు పూర్తయ్యాయని, త్వరలో పనులు ప్రారంభం కానున్నాయని అన్నారు. మన రూరల్ ఎమ్మెల్యే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేస్తున్నారని, మండల కేంద్రంలోని మినీ ట్యాంక్‌బండ్‌లో ఓ వినూత్న పద్ధతిలో బోటును మండల కేంద్ర ప్రజలకు అందుబాటులోకి రానున్నదని తెలిపారు. అలాగే మండల కేంద్రములో వంద పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే పూర్తి ప్రయత్నాలు సాగుతున్నాయని ఆరోగ్యశాఖ మంత్రితో చర్చించారని తెలిపారు. త్వరలో ఆ పనులకు ప్రభుత్వం ద్వారా ప్రకటన రానున్నదని ఆశాభావం వ్యక్తం చేశారు. మండలంలోని దుబ్బాక, ధర్పల్లి, రేకులపల్లి, తదితర గ్రామాల్లో డబుల్ రోడ్ల నిర్మాణం, అలాగే ఆయాగ్రామాల్లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు జరగనున్నదని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నల్ల సారిక హన్మంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కల్లెడ నవీన్ రెడ్డి, మండలాధ్యక్షుడు మైపాల్ యాదవ్, కిషోర్ రెడ్డి, లింబాద్రి, నర్సారెడ్డి, పసుల గంగాధర్, సజ్జు, చిన్న రెడ్డి, శ్రీకాంత్, రాజన్న, బాలయ్య భూమయ్య, శ్రీనివాస్, సుధాకర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న జడ్పీటీసీ

లొంక జాతర మహోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రానికి ఆరు కిలోమీటర్ల దూరంలో దట్టమైన అటవీ ప్రాంతంలో వెలసిన లొంక రామలింగేశ్వర స్వామి జాతర మహోత్సవానికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే, టీఎస్ఆర్‌టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ధర్పల్లి జెడ్పీటీసీ సభ్యులు, ఒలంపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాజిరెడ్డి జగన్‌ను గురువారం మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. సిరికొండ (లొంక)లో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు సకుటుంబ సమేతంగా రావాలని లొంక రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, ప్రకాష్, సంతోష్, ప్రకాష్, భూపతిరాజ్, సిరికొండ సర్పంచ్ ఎన్నం రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోర్గంలో వాటర్‌ప్లాంట్ ప్రారంభం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గం గ్రామంలో అదామ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పాపయ్య గ్రామస్తులకు వాటర్ ప్లాంట్‌ను గురువారం అందజేశారు. గ్రామస్తులు షెడ్డు నిర్మాణం చేపట్టగా.. రూ.5లక్షల 50వేల వ్యయంతో వాటర్ ప్లాంట్‌ను వారు అందజేశారని సర్పంచ్ పార్ధవాని సాయిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆదామా కంపెనీ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామస్తులతోపాటు పాఠశాల విద్యార్థులకు సైతం స్వచ్ఛమైన నీటిని అందించాలన్న ఉద్దేశంతో అన్నదాత ఫర్టిలైజర్ డీలర్ మోహన్‌రెడ్డి అభ్యర్థన మేరకు వాటిని అందజేయనున్నట్టు పాపయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్నదాత ఫర్టిలైజర్ యజమాని శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మొయినుద్దీన్, మేక సంతోష్, పుట్టి నడిపి నాగన్న, పోతన్న, లక్ష్మణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సుర్బిర్యాల్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ



మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని సుర్బిర్యాల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిథిలావస్థలో ఉన్న మరుగుదొడ్లను బెస్ట్ రన్నర్స్ అసోసియేషన్ అమెరికా స్వచ్ఛంద సంస్థ ద్వారా రూ.3.87.లక్షల నిధులతో నూతన మరుగుదొడ్ల నిర్మాణం కోసం గురువారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సట్లపల్లి సవిత గణేష్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్, మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్, స్కూల్ చైర్మన్‌లు సాగర్, లావణ్య, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి రూ.లక్ష విరాళం

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని పోచారం కాలనీలో శ్రీ అభయ బసవేశ్వర నిర్మాణ పనులకు రూ.లక్ష నగదును బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పోచారం సురేందర్ రెడ్డి గురువారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట సర్పంచ్, విండో చైర్మన్ కూచి సిద్దు, ఆలయ కమిటీ సభ్యులు సుదీప్ తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న సురేందర్‌రెడ్డి

షాదీముబారక్, కల్యాణలక్ష్మి పేదలకు వరం

- బోధన్ ఎమ్మెల్యే సతీమణి ఫాతిమా అయేషా బేగం

నవతెలంగాణ-ఎడపల్లి

షాదీముబారక్, కళ్యాణలక్ష్మి పథకాలు పేదలకు వరమని బోధన్ ఎమ్మెల్యే సతీమణి ఫాతిమా అయేషా బేగం అన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆమె పంపిణీ చేశారు. సుమారు 99 లక్షల రూపాయల చెక్కులను ఆమె బాధిత కుటుంబీకులకు అందజేశారు. అనంతరం మంగల్‌పాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన త్రిపుర బాల సుందరి ఆలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మొక్కులు తీర్చుకున్నారు. ఎడపల్లి మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణానికి ఎడపల్లి ఎంపీపీ కే శ్రీనివాస్, జెడ్పీ ఉపాధ్యక్షురాలు రజిత ఎల్లయ్య యాదవ్‌తో కలిసి భూమిపూజ నిర్వహించారు. అంతకుముందు ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఫాతిమాకు కుర్నాపల్లి సర్పంచ్ దుబ్బాక సావిత్రి రవీందర్‌గౌడ్ ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎడపల్లి ఎంపీపీ శ్రీనివాస్, జెడ్పీ ఉపాధ్యక్షురాలు రజిత ఎల్లయ్య యాదవ్, వైస్ ఎంపీపీ ఇమ్రాన్‌ఖాన్, ఎడపల్లి, కుర్నాపల్లి, మంగళ్‌పాడ్ సర్పంచులు ఆకుల మాధవి శ్రీనివాస్, దుబ్బాక సావిత్రి రవీందర్‌గౌడ్, బట్టు హనుమాన్లు, ఎంపీటీసీలు వనజ నాగరాజు, నాయుడు స్రవంతి పోతన్న, మనిషారెడ్డి, షేక్ జావిద్ బాబా, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి

కంటి సమస్యల పరిష్కారానికే కంటి వెలుగు

- ఎంపీపీ అధ్యక్షురాలు గౌతమి,
- సర్పంచ్ పద్మ రాజేశ్వర్

నవతెలంగాణ-కమర్‌పల్లి

కంటి సమస్యల పరిష్కారానికే కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ అధ్యక్షురాలు గౌతమి, సర్పంచ్ పద్మ రాజేశ్వర్ అన్నారు. గురువారం మండలంలోని హాసకొత్తూర్ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 2వ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి సుమన్, గ్రామ సర్పంచ్ ఏనుగు పద్మారాజేశ్వర్ చేతుల మీదుగా ప్రారంభించారు. స్థానిక విజేత యువజన సంఘం కళా భవనంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని వారు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంతో సదుద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలో కంటి వెలుగు శిబిరం 30 రోజుల వరకు కొనసాగుతుందని, సూచించిన విధంగా గ్రామస్తులు రోజుకు 150 మంది వచ్చి కంటి పరీక్షలు చేయించుకొని మందులు, అద్దాలు ఉచితంగా పొందాలన్నారు. ప్రయివేట్‌లో ఎంతో ఖరీదైన వైద్యాన్ని ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా అందిస్తుందని, ప్రజలు తప్పకుండా కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరానికి వచ్చే ప్రజలు వైద్యులకు సహకరించాలని కోరారు. రాష్ట్రంలోని పేద ప్రజల కోసం ఇంత మంచి కార్యక్రమాన్ని చేపట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిలకు ఈ సందర్భంగా సర్పంచ్ ఏనుగు పద్మ రాశ్వర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఏనుగు రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్ రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఏఎన్ఎం మమత, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, కంటి వైద్య నిపుణులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ గౌతమి

షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-రెంజల్

మండలానికి చెందిన 63 మందికి షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే సతీమణి అయేషా ఫాతిమా ఆధ్వర్యంలో స్థానిక మండల నాయకులు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు వికార్‌పాషా, కందకుర్తి సర్పంచ్ మీర్జా కలీం బేగ్, నీల సింగిల్ విండో చైర్మన్ ఇమామ్ బేగ్, జిల్లా నాయకులు రఫిక్, బాగేపల్లి సర్పంచ్ పాముల సాయిలు, బోర్గం ఉప సర్పంచ్ ఫిరోజ్ ఉద్దీన్, స్థానిక నాయకులు లింగం, కృష్ణారావు, మోసిన్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి

గెలుపొందిన వారికి రాష్ట్రస్థాయి పోటీలు



మాట్లాడుతున్న ఉమెన్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గెలుపొందిన వారికి రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తారని జిల్లా యువజన, క్రీడల అధికారి జె.ముత్తెన్న అన్నారు. తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పుట్టినరోజు సందర్భంగా జిల్లా యువజన, క్రీడా కార్యాలయంలో మహిళలకు జిల్లా స్థాయి చెస్ పోటీలను డీవైఎస్ఓ, స్విమ్మింగ్ పూల్, సుభాష్‌నగర్ నందు నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా తెలంగాణ ఉమెన్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆకుల లలిత పాల్గొని, కార్యక్రమాన్ని ప్రారంభిచారు. ఈ పోటీలలో విజేతలుగా గెలుపొందిన మొదటి విజేత బి.రేణుక కుమారి (బోధన్), రెండవ విజేత ఎన్.నమ్రత (ప్రభుత్వ పాలిటెక్నిక్ నిజామాబాద్, తృతీయ విజేత మిశ్ర మేహరిన్ (టీఎంఆర్జేసీ బోధన్)లకు బహుమతులు అందజేశారు. గెలుపొందినవారికి శుక్రవారం ఎల్‌బీ స్టేడియం, హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు పంపనున్నట్టు జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తన్న తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి జే.ముత్తెన్న, ఎన్.వై.కె.బి.శైలి, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రమేష్, పీఈటీలు వెంకటేశ్వర్‌రావు, కృష్ణమూర్తి, సునీల్, కబడ్డీ కోచ్ యం.ప్రశాంత్, స్విమ్మింగ్ కోచ్ జి.మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు సమితి క్యాలెండర్ ఆవిష్కరణ

- రైతుబీమా ప్రొసీడింగ్ కాపీల అందజేత



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు ఏఓ అబ్దుల్ మాలిక్ చేతుల మీదుగా రైతుబంధు సమితి క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. అనంతరం బాధిత రైతు కుటుంబాలకు వచ్చిన 5లక్షల రైతుబీమా ప్రొసీడింగ్ కాపీలను నామినీలకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపేంధర్‌రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పూర్ణానందం, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు సున్నపు అంజయ్య, సర్పంచ్ గుల్లే లావణ్య గంగాధర్, ఎంపీటీసీ జక్కని మధుసూదన్, రైతుబంధు సమితి జిల్లా మెంబర్ నెరేళ్ళ లింగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు బర్మ చిన్న నర్సయ్య, పెద్దకాపుల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు తుపాకుల శ్రీనివాస్ గౌడ్, బద్దం ప్రభాకర్, బద్దం శ్రీనివాస్ రెడ్డి, నర్ర అశోక్, ఇజాప రాజన్న, జైనోద్దీన్, ఎంఈఓలు స్నేహ, సచిన్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్ ఇద్దరికి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. స్థానిక మహిళలు నరస రూ.32000, గంగామణికి రూ.12వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు అంజయ్య, సంతోష్, సాయగౌడ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి 3
శుక్రవారం 17 ఫిబ్రవరి 2023

కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-బోధన్

ఎడపల్లి, రెంజల్ మండలాలకు చెందిన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను బోధన్ ఎమ్మెల్యే షకీల్ అమేర్ సతీమణి ఆయేషా ఫాతిమా లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రెంజల్ మండలానికి చెందిన లబ్ధిదారులకు రూ.64,07,424 విలువ గల 64 చెక్కులకు అందజేశారు. ఎడపల్లి మండల కార్యాలయంలో ఎడపల్లి మండలానికి చెందిన లబ్ధిదారులకు రూ.99,11,484 విలువ గల 99 చెక్కులకు అందించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్మెన్ రజిత యాదవ్, ఎంపీటీసీ పద్మ, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అర్బన్ ఎమ్మెల్యే



మంత్రిని సన్మానిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంఠేశ్వర్

దేవాదాయ అటవీ-పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా నిర్మల్ క్యాంపు కార్యాలయంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ జన్మదిన శుభాకాంక్షలను గురువారం తెలియచేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు ఆవరణలో మొక్కను నాటారు.

పాలకులు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



నవతెలంగాణ-రాజంపేట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారం చేపట్టి 8 ఏండ్లు అవుతున్నా.. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదని సీపీఐ నాయకులు విమర్శించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి ఆర్ఐకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎల్ దశరథ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి నిత్యావసరాల ధరలను అమాంతంగా పెంచారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ ఆదానీ లాంటి కార్పోరేట్‌లకు అప్పజెప్పున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్, దళితులకు మూడెకరాల భూమి, పోడు భూములకు పట్టాపాస్ పుస్తకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి బాలరాజ్, మండల కార్యదర్శి బత్తుల ఈశ్వర్, గ్రామ కార్యదర్శి హనుమాన్లు, నాయకులు రాములు, శ్రీను, సాయిలు, లావణ్య, నర్సింగ్, లింగం, రాజు, నరసయ్య, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

మీసేవ సెంటర్‌ను ప్రారంభించిన జెడ్పీటీసీ



మీసేవ సెంటర్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని రామడుగు గ్రామంలో కొరటపల్లి శ్రీకాంత్ అనే యువకుడు నూతనంగా ఏర్పాటు చేసిన మీసేవ సెంటర్‌ను జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ మోహన్ గురు వారం ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురుచూడకుండా సొంత వ్యాపారాలు చేస్తూ ముందుకు సాగాలని అన్నారు. చదివిన ప్రతిఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగం వైపు కాకుండా సొంత వ్యాపారస్థులుగా మరి మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని సూచించారు. ప్రజల అవసరాలకు ప్రభుత్వం ద్వారా గ్రామంలో ఏర్పాటు చేసిన మీసేవను ప్రజలు సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నల్ల సారిక హన్మంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కల్లెడ నవీన్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మైపాల్ యాదవ్, కోరటపల్లి రాజన్న, పసుల గంగాధర్, లోలం రాజేశ్వర్, లింబాద్రి, నర్సారెడ్డి, కిషోర్‌రెడ్డి, శంకర్ నాయక్, శ్రీనివాస్ నాయక్, దారావత్ గోపాల్ నాయక్, గంగారెడ్డి, నారాయణ, భూమయ్య, లింగం తదితరులు పాల్గొన్నారు.

గాయపడ్డ వ్యక్తి మృతి

నవతెలంగాణ-నందిపేట్

బైక్ అదుపు తప్పి గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఎస్ఐ శ్రీకాంత్ వివరాల ప్రకారం.. డొంకేశ్వర్ మండలంలోని నడకుడ గ్రామానికి చెందిన కుమ్మరి మదర్ (63) అనే వ్యక్తి తన బైక్‌పై నవీపేట్ మండలంలోని నాళేశ్వర్ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో డొంకేశ్వర్ మండలంలోని నికాల్‌పూర్ గ్రామ శివారులో బైక్ అతివేగంగా నడపడంతో అదుపుతప్పి ప్రమాదవశాత్తు పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మెడికవర్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్ల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న తాత్కాలిక ఉద్యోగులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ టీఎస్ ఆర్‌టీసీ డిపో ఎదుట గురువారం తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో 56 రోజుల సమ్మె కాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చామని, ఈ 56 రోజుల కాలంలో తమ సొంత పనులు తాత్కాలిక ఉద్యోగాలను వదులుకొని రాత్రనక పగలనక కష్టపడి డిపోను రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలబెట్టినామని అన్నారు. ఈ 56 రోజుల కాలంలో డిపో నుంచి ఎలాంటి యాక్సిడెంట్లు లేకుండా ప్రజా రవాణాకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా యాక్సిడెంట్లు లేకుండా విధులను నిర్వహించినామన్నారు. కావున జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎలాంటి ఖాళీలున్నా తాత్కాలికంగా భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలరాజ్, మోహన్, వహీద్, కృష్ణంరాజు, సంగీత, అనిత, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చల నడ్కుడలో కంటి వెలుగు ప్రారంభం

నవతెలంగాణ-ఆర్మూర్(వేల్పూర్)

మండలంలోని పచ్చల నడుకుడ గ్రామంలో గ్రామ పంచాయతీ ఆవరణలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "కంటి వెలుగు" కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, వైద్య అధికారుల సమక్షంలో గురువారం ప్రారంభించారు. కార్యక్రమానికి విచ్చేసిన వైద్యులు అశోక్ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకొని దృష్టి లోపమున్నవారికి ఉచితంగా కంటి అద్దాలు అందజేస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమా జమున, జెడ్పీటీసీ భారతీ రాకేష్ చంద్ర, సర్పంచ్ ఏనుగు శ్వేత గంగారెడ్డి, జిల్లా ఆర్టీఏ మెంబర్ రేగుళ్ల రాములు, ఎంపీటీసీలు గంగాధర్ గంగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లింబారెడ్డి, మండలాధ్యక్షుడు జేడి నాగధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఏలేటి రమేష్, సామ మహిపాల్, డాక్టర్ వీణ, డాక్టర్ గాయత్రి, డాక్టర్ పుణ్య రాజ్, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు దురాజ రవి, ఆది సంధ్య మహిపాల్, గోజ నరేందర్, సెక్రటరీ నవనీత, శ్రీధర్, నాగమణి, నిమ్మల రమేష్, గంగారెడ్డి, శోభ, సీసీ వరలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్, నరేష్, వీడీసీ సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, ఐకేపీ వీవోలు, రెవెన్యూ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బషీరాబాద్ ఉన్నత పాఠశాలలో

ఉదయపు పోషక పానియా సేవ



అంబలి పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉదయపు పోషక పానియా సేవ (అంబలి) కార్యక్రమాన్ని సర్పంచ్ సక్కరం అశోక్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ.. విద్యారులకు కావలసిన అన్ని సదుపాయాలను ప్రభుత్వం సమకూరుస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు బాగా చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. అదే విధంగా శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఇలాంటి మరెన్నో సేవ కార్యక్రమాలు చేపట్టి విజయవంతం కావాలని ఆకాంక్షించారు. పాఠశాల తరపున శ్రీ సత్య సాయి అన్నపూర్ణ ట్రస్ట్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బైకానీ మహేష్ నాయకులు సక్కారం నారాయణ, నేల్ల రమేష్, ఆర్‌పీ రాజు, బందెల రాజు, అబ్బాష్, ప్రశాంత్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షల ఎస్‌డీఎఫ్ కాపీ అందజేత



ఆర్టీసీ చైర్మెన్‌ను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని అమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన మున్నూరు కాపు సంఘం కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి రూ.5లక్షలు, గంగపుత్ర సంఘానికి కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి రూ.5లక్షల ఎస్‌డీఎఫ్ నుంచి మంజూరైన ప్రొసిడింగ్ పత్రాలను రెండు కులాల సంఘ సభ్యులకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తటిపాముల శ్రీనివాస్ గుప్తా అధ్వర్యంలో రాష్ట్ర ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజేశ్వర్, రెండు కులాల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరుకు వినతి..

ఇందల్‌వాయి మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు కళ్యాణ మండపానికి నిధులు మంజూరు చేయాలని గురువారం వినతిపత్రాన్ని రాష్ట్ర ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు అందజేశారు. అనంతరం ఆయన సానుకూలంగా స్పందిస్తూ నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వీడీసీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల డీసీఎంఎస్ చైర్మన్ సంబరి మోహన్, సర్పంచ్ గుర్రపు నరేష్, ఎంపీటీసీ బాపురావు, బీఆర్ఎస్ మండల పార్టీ జనరల్ సెక్రెటరీ పులి శ్రీనివాస్, మండల కోశాధికారి వంపరి రమేష్, సామాజిక కార్యకర్త పులి సాగర్, వీడీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

60వ రోజుకు చేరిన రిలే దీక్షలు

నవతెలంగాణ-బోధన్

బోధన్‌ను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ బోధన్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలో చేపడుతున్న రిలే దీక్షలు గురువారం నాటికి 60వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలలో బోధన్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎమ్.గంగారెడ్డి, అర్జున్ ర్యాండర్, వీరభద్రప్ప దీక్షలలో కూర్చున్నారు. ఈ సందర్భంగా న్యాయవాది సి.హెచ్.వి హన్మంత్‌రావు దీక్షలను ప్రాంభించి మాట్లాడుతూ.. దీక్షలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం గానీ, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. ప్రజాభిప్రాయాన్ని గౌరవించని నాయకులు కనుమరుగైపోతారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బోధన్ జిల్లాను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ దీక్షలకు బీజేపీ నాయకులు అడ్లూరి శ్రీనివాస్, న్యాయవాదులు గిరిధర్ రాజు, దత్తాత్రేయ కులకర్ణి, చంద్రకాంత్, లక్ష్మీనారాయణ, అజయ్, తర్ల శంకర్, బానోత్ రమేష్ నాయక్, సాయిలు, జాదవ్, జె.శ్రీనివాస్, గుమస్తా ఖైసర్ సంఘీభావం తెలిపారు.

బీఆర్ఎస్ రియల్ ఎస్టేట్ అడ్డాగా మారిన మున్సిపాలిటీ

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నరసింహారెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

బీఆర్ఎస్ రియల్ ఎస్టేట్ అడ్డాగా మున్సిపాలిటీ మారిందని బీజేపీ ఫ్లోర్ లీడర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నరసింహారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని పెర్కిట్ యందు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ఓపెన్ ప్లాట్‌లకు, అసైన్డ్ భూములకు హౌస్ నెంబర్‌లు ఇవ్వడంలో మున్సిపాలిటీ అడ్డాగా మారిందని, పెర్కిట్ అసైన్డ్ భూమి 1000 గజాల స్థలానికి ఇంటి నెంబర్ 1-26/47 డాక్యుమెంట్ నెంబర్ 878/22 అక్రమంగా సృష్టించి, ఇలాంటి ఇంటి నెంబర్‌లు సుమారు ఈ వారం రోజుల్లో 30 వరకు ఇచ్చారని తెలిపారు. ప్రస్తుత కమిషనర్ గతంలో రెవెన్యూ ఆఫీసర్‌గా ఉన్న సమయంలో అక్రమ హౌస్ నెంబర్‌లు ఇవ్వడంలో దిట్ట అని, ఆయనే ప్రస్తుత కమిషనర్‌గా నియామకమయ్యారని ఆరోపించారు. సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, బీజేపీ సీనియర్ నాయకులు ద్యాగ ఉదయ్, ఆకుల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు విజయానంద్, గిరిజన మోర్చా ఆర్మూర్ పట్టణ ఉపాధ్యక్షులు గుగులోత్ తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శనగ పంటకు రూ.8వేలు ధర చెల్లించాలి

- తహసీల్దార్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-రెంజల్

శనగ పంటకు రూ.8వేలు మద్దతు ధర చెల్లించాలని అఖిలభారత రైతు సంఘం నాయకులు డిప్యూటీ తహసీల్దార్ శశి భూషణ్‌కు వినతిపత్రాన్ని గురువారం అందజేశారు. అఖిలభారత రైతు సంఘం జిల్లా నాయకులు గుమ్మల గంగాధర్ మాట్లాడుతూ.. మండలంలోని కందకుర్తి, నీలా, బూర్గం తదితర గ్రామాలలో రైతులు శనగ పంట పండించి కోతలు 15 రోజులైనప్పటికీ ఇంతవరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పట్ల పక్షపాత ధోరణి వహిస్తున్నాయని, కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను దళారుల నుంచి రక్షించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు సంఘం రాష్ట్ర నాయకులు పుట్టినడిపి నాగన్న, ఎస్‌కే నసీర్, సీపీఐఎంఎల్ ప్రజాపంథా మండల కార్యదర్శి వడ్డెన్న, నాయకులు పోశెట్టి, సింగం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటర్‌ను పేద ప్రజలు వినియోగించుకోవాలి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

పేద ప్రజల సౌకర్యార్థం తెలంగాణ ప్రభుత్వం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని అవసరమైన రోగులు సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని బషీరాబాద్ సర్పంచ్ సక్కారం అశోక్ కోరారు. కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రంలో చికిత్స తీసుకుంటున్నారు. కాగా గురువారం డయాలసిస్ కేంద్రాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్, బషీరాబాద్ గ్రామానికి చెందిన డాక్టర్ నాగరాజు తనిఖీ చేశారు. ఆ సమయంలో డయాలసిస్ కేంద్రంలో చికిత్స పొందుతున్న సర్పంచ్ అశోక్‌ను పలకరించి, ఆరోగ్యంపై ఆరా తీశారు. ఆస్పత్రిలో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ.. కిడ్నీ సంబంధ సమస్యలతో బాధపడుతున్న పేద ప్రజలకు చికిత్సకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ఉచితంగా వైద్యం అందిస్తుందన్నారు. డయాలసిస్ సెంటర్‌ను పేద ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి కిడ్నీ బాధితుల తరపున సర్పంచ్ అశోక్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆకట్టుకున్న పాటలు



పాటలు పాడుతున్న దృశ్యం

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని విజయ సాయి హైస్కూల్‌లో ఐవిదా ఇన్స్టిట్యూట్ ఫర్ విజువల్ ఇంఫర్డ్ డిఫరెంట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పాటల ప్రదర్శన గురువారం ఆకట్టుకుంది. ఐవిదా ఇన్స్టిట్యూట్ ప్రతినిధులు ప్రేరణ కార్యక్రమంపై నిర్వహించిన పాటల ప్రదర్శన విద్యార్థులకు ఆకట్టుకుంది. అంగవైకల్యం ఉన్న ఎవరూ దానిని వైఫల్యంగా భావించకుండా ముందుకు సాగితే జీవితంలో విజయం సాధించవచ్చునని వారు నిరూపించారు. సమాజంలో అవయవాలు, జ్ఞానేంద్రియాలు సక్రమంగా ఉన్న కొంతమంది బాధ్యతరాహిత్యంగా వ్యవహరిస్తారని అది సమంజసం కాదని సూచించారు. అంగవైకల్యం ఉన్న మనోధైర్యంతో ముందుకు సాగాలని వారి పాటల ద్వారా ప్రదర్శిస్తూ నిరూపించారు. అంతేకాకుండా ఐవిద్య సంస్థ విద్యార్థులు వారి ప్రదర్శనతో కుటుంబాలకు ఉపాధినిస్తూ, సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని వారు పేర్కొన్నారు. సంస్థ డైరెక్టర్ సుమారెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ సురేష్, సిబ్బంది సుధీర్, శేషు, పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, మేనేజర్ ఐఆర్ చక్రవర్తి, గాయకులు భాగ్య, రోజా పాల్గొన్నారు.

నగరంలో కత్తిపోట్ల కలకలం



కత్తిపోట్లకు గురైన వ్యక్తి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలో గురువారం పట్ట పగలు ఓ యువకుడిని కత్తితో పొడిచిన ఘటన కలకలం రేపింది. స్థానికుల వివరాల ప్రకారం.. నగరంలోని 3వ టౌన్ పరిధిలోని హమాల్ వాడి చౌరస్తాలో నిలబడి ఉన్న మానే శివ కుమార్ ని బైక్ పై వచ్చిన అగంతకుడు కత్తితో పొడిచి పరార్ అయ్యాడు. దాంతో స్థానికులు శివ కుమార్ ను హుటా హుటిన జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. శివ కుమార్ జనవరి 1న బోధన్ పట్టణ శివారులోని నర్సాపూర్ వద్ద జరిగిన రౌడీ షీటర్ చాట్ల శివ హత్య కేసులో నిందితుడు. 4 రోజుల క్రితం బెయిల్ పై వచ్చిన శివ కుమార్ పై హత్యాయత్నం జరగడం చర్చనీయాంశమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

మహిళా సాధికారతకు అవార్డులు

- అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారి నుంచి దరఖాస్తుల ఆహ్వానం



నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సాధికారత, ఆర్థిక సామాజిక రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారి నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి పి.రమ్య తెలిపారు. గురువారమిక్కడ మాట్లాడుతూ మహిళల సామాజిక, ఆర్థిక సాధికారత రంగాల్లో అసాధారణమైన పరిస్థితుల్లో అత్యుత్తమంగా పని చేసిన వారికి మార్చి 8న నిర్వహించనున్న మహిళా దినోత్సవం సందర్భంగా అవార్డులు అందజేయనున్నట్టు తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన మహిళలు తమ దరఖాస్తులను జిల్లా సంక్షేమాధికారి కార్యాలయం రూమ్ నెంబర్ 31లో ఫిబ్రవరి 20లోగా సమర్పించాలని సూచించారు.

చేపూర్‌లో శివరాత్రి ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ గ్రామంలో ఉన్న అతి పురాణమైన శ్రీరాజ రాజేశ్వర స్వామి దేవస్థానం వద్ద మహాశివరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల పోస్టర్‌ను పట్టణ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్‌బాబు, సర్పంచ్ ఇందూరు సాయన్న ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు సొక్కం సంజీవ్, ఉపాధ్యక్షుడు ఆర్మూర్ గంగ మోహన్, కోశాధికారి బొబ్బిలి అనిల్ కుమార్, చేపూర్ ఎంపీటీసీ బాల్ నరసయ్య, ఉప సర్పంచ్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పొద్దుటూరు సత్యనారాయణ, కుస్తాపురం గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ జన్నపల్లి గంగాధర్, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు రెక్కల రాజు, సొసైటీ మాజీ డైరెక్టర్ సారాంగి శాంతికుమార్, ఎస్ఎస్ రెడ్డి, గ్రామ వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయంలో వేడుకలు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని మర్కల్ గ్రామంలో గురువారం వేణుగోపాలస్వామి పున:ప్రతిష్టపాన, ధ్వజస్తంభం. ప్రతిష్టపన మహోత్సవం నిర్వహించారు. కాగా వేడుకల్లో టీపీసీసీ ఉపాధ్యక్షుడు మదన్ మోహన్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొంబోతుల లింగా గౌడ్, వైస్ ఎంపిపి గాదారి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ సంగారెడ్డి, రాములు, నర్సింహారెడ్డి, రాజిరెడ్డి, తూర్పు రాజు, తదితరులు పాల్గొన్నారు.

హాథ్ సే హాథ్ జోడోలో పాల్గొన్న కాసుల బాలరాజ్

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలో హాథ్ సే హాథ్ జోడో అభియాన్ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, బాన్సువాడ నియోజకవర్గం నాయకులు కాసుల బాలరాజ్ ఇంటింటికీ తిరిగి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పనితీరును గురువారం ఎండగట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాగానే ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ పథకాలు అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొట్టం మనోహర్, మాజీ ఎంపీపీ గంధపు పవన్, నాయకులు ఆయుబ్, హనుమంతు పాల్గొన్నారు.